
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 24 మే 2025
5
తూర్పుగోదావరి



దిలీప్‌కుమార్‌కు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న బి.దిలీప్ కుమార్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. దిలీప్ కుమార్ చేస్తున్న విశిష్ట సేవలకు ప్రత్యేక గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షులు నాళం నరసింహారావు తెలిపారు. మే 31న జెఎన్ రోడ్‌లో గల ఎజెస్ రోటరీ రివర్ సిటీ హాల్లో జరిగే కార్యక్రమంలో దిలీప్ కుమార్‌కు ఈ అవార్డును అందిస్తామన్నారు. ఆయనతో పాటు శ్రీ నాగరాజా మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.చక్రధర్, చున్నీలాల్ జాజూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్.సీతా మాలక్ష్మిలకు కూడా అవార్డులు అందిస్తామని కార్యదర్శి కనకం చంద్రశేఖర రావు తెలిపారు.

మందకొడిగా ఇంటర్ అడ్మిషన్లు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల వెనుకబాటు
- జిల్లాలో ఇప్పటి వరకూ 2,584 మాత్రమే అడ్మిషన్లు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఇంటర్మీడియెట్ విద్యాబోధనలో సర్కారు కళాశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లుతోంది. జిల్లాలో జూనియర్ కాలేజీలు 47 ఉన్నాయి. వీటిలో 17 ప్రభుత్వ కళాశాలలు కాగా, 30 ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాల నిర్వహిస్తున్నాయి. ప్రతి ఏటా జిల్లాలో 10 నుంచి 15 శాతం మించి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరడం లేదు. పాలనా యంత్రాంగం జూనియర్ కళాశాలల చేరికల విషయంలో సరైన శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమై నెల రోజులు గడిచినా అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ పరిస్థితికి అడ్మిషన్ల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై ముందుకు రాకపోవటం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచుకునేందుకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదన్న ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. అడ్మిషన్లు జరిగే సమయంలో అధ్యాపకులకు వివిధ రకాల పనులను అప్పగిస్తుండటంతో వారు ఆ పనుల్లో నిమగ్నమై.. అసలు అడ్మిషన్ల సంగతే మరిచిపోతున్నారనే విమర్శలున్నాయి.

కేవలం కళాశాలకు వచ్చిన అడ్మిషన్లనే తీసుకుంటున్నారని.. అందుకే ప్రస్తుతం ఈ గడ్డు పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయాలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత మూడేళ్లుగా ఫలితాలు గణనీయంగా దిగజారాయి. మరో వైపు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. సరైన సౌకర్యాలు లేకపోవడతో తల్లిదండ్రులు తమ పిల్లలను కుదిరితే ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో లేదంటే గురుకులాలు, అమ్మాయిలను కెజిబివిల్లో చేర్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. పదో తరగతి పూర్తికాగానే వివిధ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో డేస్కాలర్ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. ఈ రకంగా గురుకులాల నుంచే ప్రభుత్వ కళాశాలలకు పోటీ ఎదురవుతున్నా.. ప్రభుత్వ కళాశాలల బలోపేతంపై దృష్టి సారించడం లేదు. గురుకులాలలో రాత్రి వరకు అధ్యాపకులు అందుబాటులో ఉండటంతో విద్యార్థులు తమ సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. డేస్కాలర్స్‌లో ఇలాంటి అవకాశం లేదు. కెజిబివిల్లోనూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపించడానికి ప్రధాన కారణమని చెబుతున్నారు. డేస్కాలర్ కాలేజీల్లో తరగతులు సక్రమంగా జరగకపోవడం ప్రస్తుత పోటీకి తగ్గట్లుగా బోధన లేకపోవడంతో తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు.

2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తొలి ఏడాది 2,309 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మరుసటి ఏడాది ద్వితీయ సంవత్సరానికి కేవలం 1,920 మంది మాత్రమే అడ్మిసన్లు పొందారు. ఈ లెక్కన 389 మంది విద్యార్థులు డ్రాపౌట్ అయినట్లు స్పష్టమవుతోంది. అదే విధంగా 2024-25 విద్యా సంవత్సరానికి తొలి ఏడాది 2,526 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకూ 2,179 మంది అడ్మిసన్లు పొందారు. ఈ లెక్కన 347 మంది డ్రాపౌట్లు అయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి తేదీ నుంచే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా మొదటి సంవత్సరానికి ఇప్పటి వరకూ కేవలం 405 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలతో పోల్చితే సర్కారు కాలేజీల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రభుత్వ కాలేజీల్లో నమోదయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలలోని విద్యార్థులకు అందజేసే పాఠ్యపుస్తకాల పంపిణీలో గత రెండేళ్లుగా ప్రహసనంలా మారింది. 2023-24లో ఉచిత పుస్తకాల పంపిణీకి పూర్తిగా మంగళం పలికిన విషయం విధితమే. 2024-25 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం మొక్కుబడిగా పంపిణీ చేసి చేతులు దులుపుకుంది. దీంతో అధ్యాపకులే చొరవ చేసి సీనియర్ల నుంచి పుస్తకాలను సేకరించి జూనియర్లకు అందజేశారు. బహిరంగ మార్కెట్లో ఎంపిసి, బైపిసి గ్రూపుల పుస్తకాలు కొనుగోలు చేయాలంటే రూ.1000పై మాటే. కామర్స్, ఆర్ట్స్ గ్రూపుల పాఠ్యపుస్తకాలకు సుమారుగా రూ.800 వరకూ ధరలు ఉన్నాయి. విద్యార్థులకు ఈ భారం తగ్గించేందుకు ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉంది.

జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల వివరాలు

విద్యాసంవత్సరం	జూ.ఇంటర్	సీ.ఇంటర్
2023-24	21,964	20,178
2024-25	22,779	20,552

ప్రయివేటు కాలేజీల్లో అడ్మిషన్లు

విద్యాసంవత్సరం	జూ.ఇంటర్	సీ.ఇంటర్
2023-24	19,655	20,354
2024-25	2025	22,799

ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లు

విద్యాసంవత్సరం	జూ.ఇంటర్	సీ.ఇంటర్
2023-24	2,309	1,824
2024-25	2,526	1,920
2025-26	405	2,179

అడ్మిషన్ల పెంపునకు ప్రయత్నిస్తున్నాం

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల పెంపునకు ప్రయత్నిస్తున్నాం. అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి క్యాంపెయిన్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అడ్మిషన్ల నమోదుకు ఇంకా గడువున్నందున సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

- డి.విజయశ్రీ డివైఇఒ, తూర్పుగోదావరి జిల్లా

ఇసుక మాఫియా అరాచకాలు అరికట్టండి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్



ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ఇసుక మాఫియా అరాచకాలను అరికట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలింపు కారణంగా ఇప్పటికే కొన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని, ఇంకెన్ని ప్రాణాలు ఇసుక మాఫియాకు బలైపోవాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం సిపిఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీని వల్ల ఇసుక రోడ్డుపై పడి వాహనదారులు జారిపడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఇసుక మాఫియా అరాచకాలు ఆగడం లేదని విమర్శించారు. చాలా చోట్ల ముఖ్యమైన రహదారులు నిండా ఇసుక భారీ స్థాయిలో పేరుకుపోయిందన్నారు. దీని ఫలితంగా వాహనదారులకు తరచూ ప్రమాదాలకు గురవు తున్నారన్నారు. ఇటీవల ధవళేశ్వరంలో కానిస్టేబుల్ కుమార్తెను ఎక్కించుకుని వెళుతూ జారిపడి ప్రాణాలు కోల్పోయారని, అదే గ్రామంలో సాయిబాబా గుడి వద్ద యువకుడు ఇసుక వల్ల జారిపడటంతో, వెనుక నుంచి వచ్చిన లారీ ఎక్కడంతో నుజ్జునుజ్జు అయి ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. ఇలాంటివి కోకొల్లలుగా జరుగుతున్నా ఇసుక తరలింపు మాత్రం ఆగడం లేదన్నారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కూడా బేఖాతరు చేసి ఇసుకు తోడుకుపోతున్నారని విమర్శించారు. జిల్లాలో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కొవ్వూరు తదితరు ఇసుక ర్యాంపులో ఉన్న ప్రాంతాల్లో రహదారులు మరింత దుర్భరంగా మారాయని వివరించారు. వెంటనే ఉన్నత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఇసుక మాఫియా ఆగడాలను, అరాచకాలను అరికట్టాలన్నారు. లేకుంటే మరిన్ని ప్రాణాలు గాల్లో కలిసి పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వం అధికారులు స్పందించి వెంటనే ఇసుక అధిక లోడ్‌లను నియంత్రించాలని లేకపోతే తామే ప్రజలను సమీకరించి ఇసుక లారీలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలకు అనుకూలంగా పనిచేయాలి



ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సిహెచ్.లావణ్య ఆదేశించారు. అన్ని ఎక్సైజ్ స్టేషన్లల్లో ఇన్‌స్పెక్టర్, సిబ్బంది రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. సమయపాలన, విడి విక్రయాలు, ఎంఆర్‌పికి మించి అమ్మకాలు లేకుండా చూడటం, అనధికార సిట్టింగ్‌లను నివారించడం, షాపు పరిసరాలన్నీ శుభ్రంగా ఉంచడం, షాపులో రికార్డులు సమర్ధవంతంగా నిర్వహించడం, సిసి కెమరాల పనితీరు వంటి వాటిని పరిశీలిస్తారన్నారు. ప్రతి కానిస్టేబుల్‌కు మూడు లేదా నాలుగు షాపుల బాధ్యతను అప్పగించామన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్, సహాయ ఎక్సైజ్ పర్యవేక్షకులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. మరింత పకడ్బందీగా నిర్వహించేందుకుగాను ఎక్సైజ్ 'ఐ' అనే మొబైల్ అప్లికేషన్ కూడా త్వరలో ఎక్సైజ్ శాఖ తీసుకొస్తుందన్నారు. ఈ యాప్ ద్వారా మద్యం షాపు, బార్‌లలో జరిగే అన్ని కార్యకలాపాలను నేరుగా పర్యవేక్షించే వీలుంటుందన్నారు. మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే టోల్ ఫ్రీ నెంబరు 14405కి కాల్ చేయొచ్చని ఆమె ప్రజలకు సూచించారు. నిబంధనలు ఉల్లఘించిన మద్యం షాపులు, బార్ అండర్ రెస్టారెంట్లపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు.

పేదలకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - పెరవలి


పేదలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన మండల అధ్యక్షులు పిప్పర రవి అన్నారు. 34 మందికి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి కార్యాలయంలో శుక్రవారం అందించారు. మంత్రి అందుబాటులో లేకపోవడంతో సుమారు రూ.16,20,800 విలువ చేసే చెక్కులను మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు మంత్రి ఆదేశాలతో రవి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తులా చినబాబు, పాల వీరాస్వామి, కాకర్ల నాని, చక్రవర్తి, నల్లకుల నాగన్న,సంగీత నాగు, రేలంగి రాజేష్, గుబ్బల వెంకటేశ్వరావు, రంకిరెడ్డి ప్రసాద్, సిహెచ్.మూర్తి, అడ్డగర్ల శక్తిబాబు, కోటిపల్లి మురళి, శివ అనుకూల శ్రీను, పూడి శంకర్, పవన్, పుల్లా శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఖండవల్లి, అన్నవరప్పాడు, కొత్తపల్లి అగ్రహారం, నల్లాకులవారిపాలెం, కాపవరం గ్రామాలకు చెందిన పాడి రైతులకు తొలివిడతగా పశువుల దాణాను సబ్సిడీపై అందించారు. ఖండవల్లి పశు వైద్యశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పశువైద్యులు, కూటమి నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు. 72 బస్తాల దాణాను రైతులకు అందించామని అధికారులు తెలిపారు. రూ.1110 విలువ చేసే బస్తాను 50 శాతం సబ్సిడీపై రూ.550లకే అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంల పాడి రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్టూ'నిజం'



హాస్టళ్లలో వసతుల కల్పనకు ప్రాధాన్యత



ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని, స్కూల్స్ ప్రారంభించే నాటికి ఆయా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బిసి సంక్షేమ హాస్టళ్లల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనపై, పివిజిటి గ్రూపులకు గృహ నిర్మాణ పనులు చేపట్టడంపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బడి బయట పిల్లలను గుర్తించితిరిగి స్కూళ్లకు వెళ్లేలా చూడాలన్నారు. వారికి వసతి గృహాల్లో సీట్లను కేటాయించాలన్నారు. దీని కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలన్నారు. ఈ మేరకు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విడాకులు తీసుకున్న, విదేశాలకు వెళ్లిన మహిళల పిల్లలు, అనురక్షిత వాతావరణంలో ఉన్న ఆడ పిల్లలను గుర్తించి హాస్టళ్లలో చేర్పించాలన్నారు. తక్కువ పిల్లలు ఉన్న వసతిగృహాలను గుర్తించి హేతుబద్ధీకరించాలని సూచించారు. అన్ని వసతిగృహాల్లో టీవీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. హాస్టళ్లలో పూర్తయిన పనులకు సంబంధించి వినిమయ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఆదేశించారు.

పివిజిటి గ్రూపులపై సమీక్ష

పిఎం-జన్మాన్ పథకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇతర పథకాల పురగోతిపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో పివిటిజిగా చెంచు కమ్యూనిటీకి చెందిన 399 మంది జనాభా ఉన్నారన్నారు. వీరందరికీ ఆధార్‌కార్డులు, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, ఆరోగ్య శ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డులు ఉన్నాయా? లేదా? అనేదానిపై వ్యక్తల వారీగా సమగ్ర డేటా సేకరణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. కార్డులు లేని వారికి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత కలిగిన వారికి వికలాంగుల పింఛన్ల కోసం సదరం ధ్రువపత్రాల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. సొంత ఇంటి నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు కేటాయించాలన్నారు. బడి ఈడు పిల్లలను గుర్తించి అందర్నీ బడిలో చేర్పించాలన్నారు. ఒక కిలో మీటర్ పరిధిలో స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం లేకపోతే హాబిటేషన్‌లలో వాటిని నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. యువతను గుర్తించి, వారి ఆసక్తి మేరకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎంఎస్.శోభారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి, జిల్లా వెనుకబడిన వర్గాల సంక్షేమ అధికారి బి.శశాంక్, ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్.అప్పలకొండ, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి కె.విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో టి-హబ్ ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా ప్రధాన కేంద్రంలో త్వరలో టి-హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నుంచి టి-హబ్ ఏర్పాటుపై సమన్వయ శాఖల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టి-హబ్ ఏర్పాటుకోసం రాజమహేంద్రవరం రూరల్‌లోని నైపుణ్యాభివృద్ధి కేంద్ర భవనంతో పాటు ఒక ప్రైవేట్ భవనాన్ని పరిశీలించినట్టు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రం అన్ని విధాలా అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమిక పరిశీలన అనంతరం అంచనాకు వచ్చామన్నారు. అయితే ఆ భవనంలో మరికొన్ని మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుందన్నారు. అందుకనుగుణంగా అవసరమైన పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. వికలాంగుల కోసం ర్యాంపు, లిఫ్టును ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. టి-హబ్‌ను తొలి దశలో మొదట 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. తదనంతరం దీని పరిధిని 7వేల చదరపు అడుగులకు పెంచుతామని తెలిపారు. ఆ విస్తరణ పనులను రానున్న 100 రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే టి-హబ్ యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జెఎన్‌టియు కాకినాడ, ఎన్ఐటి తాడేపల్లిగూడెం, అవంతి, గ్రీన్ కో సంస్థలు టిహబ్‌లో భాగస్వాములుగా ఉన్నాయన్నారు. బోర్డులో జాయింట్ కలెక్టర్ సభ్యునిగా ఉంటారని తెలిపారు. టి-హబ్‌కు అవసరమైన భవనాలు, సిబ్బంది, మౌలిక వసతులను దశల వారీగా సమకూర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవాణిధర్‌రామన్, , పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు ప్రదీప్, ఇన్‌ఛార్జి మెప్మా నీడీ శ్రీదేవి, నైపుణ్య అభివృద్ధి అధికారి విజిడి.మురళి, పరిశ్రమల సహాయ సంచాలకులు ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు 'భాష్యం'





ప్రజాశక్తి - దేవరపల్లి

నాణ్యమైన విద్యకు చిరు నామాగా నిలుస్తుంది దేవర పల్లిలోని భాష్యం విద్యాసంస్థ.పచ్చని చెట్ల మధ్య ప్రశాంతమైన వాతా వరణంలో విశాలమైన క్రీడా ప్రాంగణంతో ఈ విద్యాసంస్థలను నెలకొల్పారు. విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఆలోచనతో 2015లో 350 మంది విద్యార్థులతో ఈ పాఠశాల ప్రారంభమైందని ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు తెలిపారు. ఈ బ్రాంచ్ పదేళ్లుగా దినదిన ప్రవర్ధమానంగా విజయపథంలో దూసుకుపోతుందన్నారు. సుమారు వేయి మందికిపైగా విద్యార్థులతో ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకూ క్లాసులను నిర్వహిస్తున్నామన్నారు. పటిష్టమైన ప్రణాళికతో ఐఐటి ఫౌండేషన్‌లో నాణ్యమైన విద్యనందిస్తున్న విద్యాసంస్థగా గుర్తింపు పొందిందన్నారు. పుస్తకాల్లో జ్ఞానాన్ని మాత్రమే అందించకుండా వందేళ్ల జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఎదురు నిలబడి పరిష్కరించగలిగే ఆత్మస్థయిర్యాన్ని తమ విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. 'స్టూడెంట్ సక్సస్ - పేరెంట్ సాటిస్ఫాక్షన్' అనే మొటోతో విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తూ అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ తల్లిదండ్రుల మన్ననలను చూరగొన్నామని తెలిపారు. ఎంతో మంది తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభా పరీక్షల్లో రాణించారన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ సత్తా చాటారన్నారు.


పాఠశాల భవనం

2018లో ఎం.జాహ్నవి ప్రతిభా అవార్డు, 2020 ట్రిపుల్‌ఐటిలో బి.జాన్ దేవదాస్ స్టేట్ 25వ ర్యాంక్, 2021 ట్రిపుల్‌ఐటిలో ఎస్.మహేష్ స్టేట్ 402వ ర్యాంక్, 588 మార్కులతో పాతూరి నిఖిల్ 2023 ఎస్ఎస్‌సిలో మండల్ ఫస్ట్, 594 మార్కులతో అంబటి రేవంత్ 2024 ఎస్ఎస్‌సి ఫలితాల్లో మండల్ ఫస్ట్ సాధించారని గుర్తు చేశారు. వివిధ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధిస్తున్న విద్యాసంస్థ భాష్యం అన్నారు. తమ దేవరపల్లి శాఖలో విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు నేడు దేశ విదేశాల్లోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలలో ప్రవేశాలు పొందారని తెలిపారు.

పాఠశాల ప్రత్యేకతలు

- ఇంటిగ్రేటెడ్ సిలబస్
- ఐఐటి ఫౌండేషన్ మాంటిస్సోరి విధానంలో కేజీ విద్య
- డిజిటల్ తరగతుల నిర్వహణ
- పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- వ్యక్తిత్వ వికాస పాఠాలు కేరీర్ గైడెన్స్
- స్టడీ అవర్స్ నిర్వహణ
- పారదర్శకమైన పరీక్షల విధానం.
- రెమెడియల్ క్లాసెస్
- మ్యాథ్స్ అండ్ సైన్స్, కంప్యూటర్ ల్యాబులు
- హ్యాండ్ రైటింగ్, ఫొనెక్స్, అబాకస్‌లో శిక్షణ
- క్విజ్, స్పెల్‌బి పోటీలల నిర్వహణ
- యోగా, నృత్యం, కరాటే, స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో శిక్షణ
- పరిసర ప్రాంతాలకు బస్ సౌకర్యం


బురదమయంగా మారిన రోడ్డు

అధ్వాన్నంగా కాటకోటేశ్వరం రోడ్డు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

మండలంలోని కాటకోటేశ్వరం గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. వర్షాలు పడటంతో బురదమయంగా మారింది. దీంతో ఆటుగా ప్రయాణించాలంటే గ్రామస్తులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేకుండా రోడ్డు తయారైందని స్థానికులు చెబుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో పాటూ గుంతల మయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతే కాకుండా రోడ్ల పక్కనే చెత్తను డంప్ చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త కుళ్లిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. ఆ వీధిలో వెళ్లాలంటేనే దుర్గంధంతో ముక్కుపుటాలు అదురుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ సిసి రోడ్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అప్పటి వరకూ కనీసం గ్రావెల్ రోడ్డు అయినా వేయాలని కోరుతున్నారు.

వైఎంసిఐ కోరుమామిడి కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్

వైఎంసిఐ కోరుమామిడి నూతన కార్యవర్గం ఎన్నిక జరిగినట్లు సోత్ ఇండియా రీజియన్ చైర్మన్ టి.సుమన్ త్యాగరాజు తెలిపారు. అధ్యక్షులుగా జి.రాజు, ప్రధాన కార్యదర్శిగా గుంపుల వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా కొయ్య చిన్నకృష్ణంరాజు, జాయింట్ సెక్రటరీగా మెప్పెల్లి విజయ భాస్కర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌పి డి.నరసింహకిశోర్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మహిళలు, బాలికల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా పోలీసు అధికారులు, శక్తి టీమ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శక్తి టీమ్‌ల పని తీరును స్వయంగా పరిశీలించి, మెరుగైన పనితీరుకై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. జిల్లాలో మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దీనికి అనుగుణంగానే ప్రతి పోలీస్ స్టేషన్లో ఉమెన్ హెల్ప్ డెస్క్, మహిళల ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి మహిళ మొబైల్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. తద్వారా పోలీసు సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయన్నారు.శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పిలు ఎన్‌బిఎం.మురళీకృష్ణ, ఎవి.సుబ్బరాజు, అర్జున్, డిఎస్‌పిలు బి.రామకృష్ణ, కెవి.సత్యనారాయణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, జోనల్ డిఎస్‌సిలు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పట్టాభి కుటుంబానికి మాజీ మంత్రి వేణు పరామర్శ

ప్రజాశక్తి-కడియం

పితృ వియోగంతో బాధపడుతున్న వైసిపి నాయకుడు సాకా పట్టాభి కుటుంబాన్ని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు శుక్రవారం పరామర్శించారు. కడియంలోని పట్టాభి స్వగృహానికి చేరుకున్న ఆయన సాకా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సాకా సత్యనారాయణ, వెంకన్నబాబు, సురేష్‌లను పరామర్శించి ఓదార్చారు. సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, నాయకులు ఈలి గోపాలం, పూడి బ్రహ్మం, ఖండవల్లి సురేంద్ర, ముగతా మణికంఠ తదితరులున్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వేణు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని ఎర్రపోతవరం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. రామచంద్రపురం పట్టణంలోని రాజు గారి కోట కాలనీకి చెందిన ఉందుర్తి సురేష్, భార్య స్నేహలతతో కలిసి యానం నుంచి రామచంద్రపురం స్వగ్రామానికి బయలుదేరి మార్గమధ్యలో ఎర్ర పోతవరం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భార్య, భర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేసి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి తరలించారు. దీనిపై కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

స్థానిక మెయిన్ రోడ్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అయినవిల్లి మండలం పోతుకూరు గ్రామానికి చెందిన సాగిరాజు నరసింహారాజు(54) మండల పరిధిలోని పల్లంకూరు శివారు లైట్ హౌస్ ప్రాంతంలో ఉన్న ఆనంద హేచరీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నరసింహారాజు బైకుపై పల్లంకూరు వైపు వెళుతుండగా పల్లం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో నరసింహారాజు తలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన 108లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు. ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్టు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల చేబ్రోలులో కిలాడి జ్యోతిపై ఆమె భర్త శ్రీను కత్తితో దాడి చేయగా ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులు కేసు కేసు నమోదు చేశారు. శుక్రవారం శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో స్థానిక హోటల్లో పని చేస్తూ వేడినీళ్ల మీదపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న పుడికోడి కష్ణన్ పద్మనాభన్ స్థానిక హోటల్లో పని చేస్తూ వేడినీరు దింపుతుండగా నీళ్ల కాలు మీద పడి గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందాడు దీనిపై మృతుని సోదరుడు కృష్ణన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మోటార్లను దొంగిలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి- గోకవరం

మండలంలో రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాలలో బ్యాటరీ లు, పొలాల్లో మోటార్ ఇంజిన్లను చోరీ చేస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 బ్యాటరీలు, 1 మోటార్ ఇంజన్‌ను రికవరీ చేశామని పోలీసులు తెలిపారు. పూర్తి దర్యాప్తు అనంతరం రిమాండ్‌కు తరలిస్తామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-తొండంగి

తొండింగి మండలం బెండపూడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా మరో ఇద్దరు స్వల్పంగా గాయపడినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. గోపాలపట్నం గ్రామానికి చెందిన సాయి ఆనంద్ తమ తల్లిదండ్రులను బైకుపై కాకినాడ నుండి తన గ్రామానికి తీసుకొని వస్తుండగా బెండపూడి సమీపంలో జాతీయ రహదారిపై బైకు అదుపుతప్పి కింద పడిపోవడంతో బైకుపై ఉన్న తల్లి అమ్మాజీ అక్కడక్కకే మృతి చెందగా తండ్రి సూరిబాబు, ఆనంద్‌కు గాయాలైనట్లు చెప్పారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

బైకు చక్రానికి చీర చుట్టుకుని మహిళ మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలం పోలేకుర్రు పంచాయతీ జైభీమ్ పేట వద్ద జాతీయ రహదారి 216పై గురువారం జరిగిన ఒక ప్రమాదంలో మేడిశెట్టి పద్మ (44) అనే మహిళ మరణించింది. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడ రూరల్ మండలం రామారెడ్డి నగర్‌కు చెందిన మేడిశెట్టి పద్మ, శ్రీనివాసరావు దంపతులు యానాం వైపు నుంచి కాకినాడ బైకుపై వెళుతుండగా జైభీమ్ పేట సమీపంలో పద్మ చీర బైకు చక్రంలో పడి చుట్టుకుపోయింది. దీంతో కింద పడిపోయి గాయపడిన ఆమెను కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కోరంగి పోలీసులు తెలిపారు.

గంజాయితో ఉన్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

గంజాయి కలిగివున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ సిహెచ్. విద్యాసాగర్ వెల్లడించిన వివరాల ప్రకారం... పెదపళ్ళ గ్రామ శివారులో ఉన్న స్మశాన వాటిక దగ్గర శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గంజాయి కలిగిన వ్యక్తులు ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే సిబ్బందితో దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. ఒక్కొక్కరి వద్ద 100 గ్రాముల చొప్పున గంజాయి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరి నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

కాలువలు కలుషితం

- గట్లపై చెత్త డంపింగ్, మరోపక్క ఆక్రమణలు
- కుచించుకుపోతున్న పంట కాలువలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని గోదావరి కాలువలు కలుషితమయంగా మారిపోయాయి. మరో పక్క ఆక్రమణలతో కుచించుకుపోతున్నాయి. కాలువలను ఆనుకుని ఉన్న గ్రామాల నుంచి సేకరించిన చెత్తను కాలువగట్లపై డంప్ చేయడంతో ఇదంతా కాలువల నీటిలో కలుస్తుంది. దిగువ ప్రాంతాలకు వెళ్లే సాగు, తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. విజ్జేశ్వరం నుంచి నర్సాపురం దిగువకు గోదావరి మెయిన్ కెనాల్ ఉంది. కాలువలను ఆనుకుని తీపర్రు, కాకరపర్రు, వెంకటరాయపురం, అజ్జరం, పెరవలి, కాపవరం గ్రామాలున్నాయి. ఈ గ్రామాల నుంచి సేకరించిన చెత్తను కాలువ గట్లపై డంప్ చేస్తున్నారు. ఈ చెత్త కుళ్లి తీవ్ర దుర్వాసన వస్తుంది. వర్షం వచ్చిన సందర్భంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. కుళ్ళిన చెత్త నేరుగా కాలువలో కలవడంతో నీరు కలుషితం అవుతుంది. కొన్ని చోట్ల పశుకళేబరాలను సైతం కాలువల్లో పడేస్తున్నారు. మరోపక్క ఆయా గ్రామాల పరిధిలో గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. వీరి వాడుకపు నీరు నేరుగా కాలువల్లోకి వదిలేస్తున్నారు. దీంతో నీరంతా కలుషితమవుతుంది. కాలువ గట్లపై షెడ్లు నిర్మించి ఆక్రమించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

డెల్టా దిగువ మండలాలు పెనుగొండ, పోడూరు, యలమంచిలి, పాలకొల్లు, నర్సాపురం, మొగల్తూరు, ఆచంట మండలాలకు వెళ్లే కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. గోదావరి ప్రారంభంలోని రెండు మండలాలు నిడదవోలు, పెరవలి పరిధిలో కాలువలోకి నేరుగా మురుగు నీరు, చెత్తను వేయడంతో పూడుకుపోతోంది. సాగునీటి కాలువలు మురుగునీటి కాలువలుగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సాగునీటి సంఘాల ఏర్పాటు చేసినప్పటికీ కాలువలు ఆధునికీకరణ ఆయా గ్రామాల పరిధిలో చెత్త తొలగింపు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలులకు మెయిన్ కెనాల్, బ్యాంక్ కెనాల్‌లో పలు ప్రాంతాల్లో విరిగిన చెట్లు కొమ్మలు ఇప్పటికీ తొలగించిన దాఖలాలు లేవని రైతులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల పరిధిలో వాడకపునీరు నేరుగా కాలువల్లోకి వదిలేస్తున్నారు. వదిలి ఆక్రమణదా కాలువ గట్లు ఆక్రమణ చేస్తున్న అధికారులు పట్టించుకునే దాఖలు లేవు. ఇకనైనా అధికారులు స్పందించి కాలువలను కాలుష్యం నుంచి అరికట్టాలని కోరుతున్నారు.


కాలవ గట్టుపై చెత్త

పూడికతీతకు రూ.7లక్షలు మంజూరు



నరసాపురం మెయిన్ కెనల్ పూడిక తీత పనులకు రూ.7 లక్షలు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న నీటి సంఘాలకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తాం. పేకేరు కాలువ తూడు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. పెరవలి, ఈస్ట్ ఇప్పర్రు, తీపర్రు, అజ్జరం, వెలగదుర్రు గ్రామాల్లో కాలువల పూడిక తీత పనులు ఆయా సంఘాల ద్వారా జరుగుతాయి.

- బి.బాలమురళి, ఎఇ, ఇరిగేషన్ శాఖ, పెరవలి

పూడిక తీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి - గోపాలపురం

కొవ్వాడ కాలువ పూడిక తీత పనులను శుక్రవారం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం మండలం ఎల్ఎన్‌డి పేట కొవ్వాడ రిజర్వాయర్ నుంచి వరద నీరు కొవ్వాడ కాలువ ద్వారా గోపాలపురం, దేవరపల్లి మండలాల మీదుగా వెళ్తుందన్నారు. ఈ కాలువ పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో వరి పొలాలు ముంపు గురవుతున్నాయన్నారు. రైతులు తీవ్రం నష్టపోతున్నారని తెలిపారు. దీంతో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. 12 కిలోమీటర్ల మేరకు రూ.80 లక్షలతో పూడికతీత పనులు చేపట్టామన్నారు.మరో రూ.23లక్షలు కొవ్వాడ ప్రాజెక్టు ద్వారా పంట పొలాలకు అందించే ఇరిగేషన్ పంట కాలువలు అభివృద్ధి పనుల కోసం మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ రాహుల్ భాస్కర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


పూడిక తీస్తున్న ఎంఎల్ఎ

ఘనంగా నగరపాలక సంస్థ వార్షికోత్సవం

పలువురికి అవార్డులు అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వార్షికోత్సవం గాదాలమ్మ టెంపుల్ రోడ్డులోని బివిఆర్.శ్రీ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగాయి. కమిషనర్ కేతన్ గార్గ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చిన్నరాముడు, ఎస్‌పి డి.నరసింహకిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అధికారులు, ఉద్యోగులు సందడి చేశారు. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ.. పనుల ఒత్తిడితో సతమతమయ్యే అధికారులు, సిబ్బందికి ఇటువంటి కార్యక్రమాలు ఆటవిడుపుని, ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ఈ అవార్డులతో ఉద్యోగులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే రీతిలో నగర ప్రజల కోసం పూర్తిస్థాయిలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి నగరపాలక సంస్థను రానున్న రోజుల్లో మరింత ప్రగతి పథంలోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే దూరదష్టి, అపారమైన అనుభవంతో ఓవైపు యంత్రాంగానికి మార్గదర్శకత్వం వహిస్తూ.. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కమిషనర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచే అధికారులు, సిబ్బందిని ఈ వేదిక ద్వారా సత్కరించుకోవడం సంతోషదాయకమన్నారు. గడిచిన ఏడాది కాలంలో నగరం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితోనే ఇది సాధ్యపడిందని చెప్పారు. ఈ అవార్డులు ఉద్యోగుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు వారిపై బాధ్యతను మరింత పెంచుతాయన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకువెళ్లాలని కోరారు. రానున్న రోజుల్లో మీ అందరి సహాయసహకారాలతో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉంటుదనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. అనంతరం పలువురు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులను మెమోంటోలు, ప్రశంసాపత్రాలు, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కృష్ణనాయక్, ఆర్‌డిఎంఎ నాగ నరసింహరావు, అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఒ వినూత్న, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్, ఇతర అధికారులు, ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





కమిషనర్ కేతన్‌గార్గ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జెఇఇ మెయిన్ బి-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జెఇఇ మెయిన్ బి-ఆర్క్ అండ్ బి-ప్లాన్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బి. ఆర్క్ జనరల్ ఇడబ్ల్యుఎస్ విభాగంలో కె.యశ్వంత్ సాత్విక్ ఆలిండియా 1వ ర్యాంకు, వి.రామసాయివరుణ్‌రెడ్డి 4వ ర్యాంకు సాధించారన్నారు. బి.ప్లానింగ్ విభాగంలో వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో కె.యశ్వంత్ సాత్విక్ 3వ ర్యాంకు, వి.రామ సాయివరుణ్ రెడ్డి 3వ ర్యాంకు, టి.షణ్ముఖ శ్రీనివాస్ 24వ ర్యాంకు, టి.జశ్వంత్ దొర 63వ ర్యాంకు, వై.సాయితేజ, టి.పవన్ శ్రీ కుమార్ చౌదరి 78వ ర్యాంకు, సుంకర జోషిచంద్ 99వ ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ జి, సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరిలతో కలిసి అభినందించారు.


కె.యశ్వంత్‌సాత్విక్


వి.రామసాయివరుణ్‌రెడ్డి

వ్యక్తి తొడలో దిగిన చెట్టు కొమ్మ

ఆపరేషన్ చేసి తొలగింపు

ప్రజాశక్తి - పెరవలి

ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యం ఒక వ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చింది. ఇటీవల వీచిన ఈదురుగాలులకు పెరవలి, కాకరపర్రు, తీపర్రు గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రహదారిపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. తీపర్రు-కాకరపర్రు మధ్య గ్యాస్ గుడౌన్ సమీపంలో ఒక చెట్టు కొమ్మ రోడ్డుపై విరిగిపడింది. దీన్ని తొలగించకుండా అలానే ఉంచేశారు.కానూరు అగ్రహారం గ్రామానికి చెందిన చిర్రావూరి సూర్యనారాయణమూర్తి గురువారం రాత్రి బైకుపై పెరవలి నుంచి కానూరు వెళ్తున్నాడు. రోడ్డు చీకటిగా ఉండటంతో విరిగిన చెట్టుకొమ్మను ఆయన గమనించకపోవడంతో ఢీకొన్నాడు. బైకుతోపాటూ చెట్టు కొమ్మపై పడిపోయాడు. ఈ సమయంలో ఎండిపోయిన కొమ్మ ఆయన తొడ భాగంలో దిగిపోయింది. సమీపంలో ఉన్న కొంత మంది గ్రామస్తులు చూసి వెంటనే 108కు సమాచారం అందించారు. దీంతో కొమ్మతో పాటు బాధితుని 108లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆపరేషన్ చేసి కొమ్మను తొలగించారు. ఈదురు గాలులకు చెట్లు కొమ్మలు విరిగి పడినా అధికారులు పట్టించుకోవడంతో వాహన దారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని,దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


కొమ్మను కట్ చేస్తున్న స్థానికులు

చినుకు పడితే చిత్తడే..!

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వడ్లూరు - తీపర్రు రహదారి చివటం రైలు గేటు వద్ద రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. రోడ్డుకు ఒకవైపు ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీ, మరోవైపు రైస్ మిల్ ఉన్నాయి. రైల్వే లైన్ డబ్లింగ్ చేయడం వల్ల ప్రతి గంటకు కనీసం మూడు సార్లు మూసుకుపోయే రైల్వే గేటు ఉంది. దీంతో ప్రయాణికులు ఆ రహదారి వెంబడి ప్రయాణించాలంటే చుక్కలు చూస్తున్నారు. రద్దీ ఎక్కువ ఉండే ఉదయం, సాయంత్రం సమయాల్లో ఇక్కడ వాహనాలు నిలిచిపోతుంటాయి. మురుగు నీటిలోనే కాళ్లు పెట్టి, రైలు వెళ్లే వరకు వేచి ఉండాల్సి వస్తోంది. రోడ్డుకు సంబంధించిన సైడ్ బెర్మ్ కూడా రోడ్డును మించిన ఎత్తులో ఉండడంతో వర్షపు నీరు అక్కడే నిల్వ ఉండిపోతోంది. చినుకు పడితే చిత్తడిగా మారి, వాహన చోదకులకే కాదు పాదచారులను సైతం ప్రమాదాలకు గురి చేస్తోంది. వర్షం కురిసి, వెలిసి పోయిన మూడు రోజుల అనంతరం కూడా రోడ్డు మురుగునీటితో నిండే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు, దానికి మించిన స్థాయిలో రైతులు, రైతు కూలీలు, వివిధ ఫ్యాక్టరీలకు సంబంధించిన చిరు ఉద్యోగులు, పాదచారులు ప్రయాణిస్తున్న ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని, సంబంధిత అధికారులను కోరుతున్నారు.


చిత్తడిగా మారిన రోడ్డు

గ్రామదర్శిని ద్వారా సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - గోపాలపురం

గ్రామ దర్శిని కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాధపురం, కరిచర్లగూడెం, గోపాలపురం, కోమటికుంట, వాదాలకుంట, గుడ్డిగూడెం, సంజీవపురం, కరగపాడు గ్రామాల్లో నిర్వహించిన గ్రామదర్శినిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో గోపాలపురం ఎంతో వెనకబడి ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గోపాలపురంలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామదర్శిని ద్వారా ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించి, అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండియు వాహనాల రద్దుపై ధర్నా

ప్రజాశక్తి-పిఠాపురం

ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన ఎండియు వాహనాలను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఎండియు ఆపరేటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆపరేటర్లు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక పశువుల సంత నుండి ఉప్పాడ బస్ స్టాండ్ సెంటర్ వరకూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిద్ధాంతపు రవికుమార్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ల సుబ్రమణ్యం, యాదాల అప్పలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఎండియు వాహనాలతో ప్రతి గడపకూ రేషన్ సరుకులు అందిస్తున్నామని, కూటమి ప్రభుత్వం ఈ వాహనాలను రద్దు చేసే విధంగా ఆలోచన చేయడం సరి కాదని హితవు పలికారు. రాష్ట్రంలో పలు విపత్కర పరిస్థితులలో ఎండియు వాహనాల ద్వారా రాష్ట్ర ప్రజలకు అనేక సేవలందించారని గుర్తు చేశారు. దీని మీద ఆధారపడి అనేకమంది తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వీటిని రద్దు చేయడంతో కుటుంబాలు రోడ్డుపాలు అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న ఎండియు ఆపరేటర్లకు మాజీ ఎంపీ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎండియు వాహనాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం తహశీల్దారు పి.గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డైవపాల్, చెట్ల శ్రీను, చొల్లంగి వీరభద్రరావు, ఎం.వరప్రసాద్, ఒ.కోదండరాం, వెంకటరమణ, బాబ్జీ, వైసిపి నాయకులు రావుల మాధవరావు, జి.బాబీ, నాగమల్లీశ్వరి, వర్ధినీడి సుజాత, వి.శ్రీను, అడపా రఘు, జెడ్‌పిటిసి లోవరాజు, ఆనాల సుదర్శన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆపరేటర్లు

భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని అన్ని గ్రామాల్లో అనధికార కట్టడాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తహశీల్దార్ ఎం.మెరికమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరం లేని ప్రభుత్వ, పోరంబోకు స్థలాల్లో అనధికారంగా నిర్మించుకున్న పక్కా ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం జిఒ 30ని విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం 2019 అక్టోబర్ 15 తేదీ కంటే ముందుగా ప్రభుత్వ, పోరంబోకు స్థలాల్లో అనధికారంగా నిర్మించుకున్న పక్కా ఇళ్లను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఇంటి పన్ను, కరెంటు బిల్లులతో తమ వార్డు, గ్రామ సచివాలయంలోని విఆర్ఒ లకు దరఖాస్తు చేయాలన్నారు. 150 చదరపు గజాల్లో నిర్మించుకున్న ఇంటికి ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని తెలిపారు.

ప్రశాంతంగా ఎపిఇఎపి సెట్-2025

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఎపిఇఎపిసెట్-2025 ఆన్‌లైన్ పరీక్ష శుక్రవారం ఐదో రోజు ప్రశాంతంగా జరిగినట్టు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం ఆదిత్య యూనివర్సిటీలో 240 మందికిగాను 233 హాజరు కాగా ఏడుగురు హాజరు కాలేదని, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 295 మందికిగాను 284 మంది హాజరు కాగా 11 మంది హాజరు కాలేదని, సాయంత్రం ఆదిత్య యూనివర్సిటీలో 240 గాను 235 హాజరు కాగా 05 మంది హాజరు కాలేదని తెలిపారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో 294 మందికిగాను 284 మందిహాజరు కాగా 10 మంది హాజరు కాలేదని తెలిపారు. ఈ ఎగ్జామ్స్‌కు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆదిత్య ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించారు. ప్రొఫెసర్ ఎం.రాజబాబు, ప్రొఫెసర్ టి.శ్రీనివాసులు, ప్రొఫెసర్ వీరప్రసాద్ కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

ఎల్ఐసి బ్రాంచ్‌ను సందర్శించిన ఎస్‌డిఎం

ప్రజాశక్తి- గోకవరం

రాజమహేంద్రవరం ఎల్ఐసి డివిజన్‌లో సీనియర్ డివిజన్ మేనేజర్‌గా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ సాహూ శుక్రవారం గోకవరం ఎల్ఐసి బ్రాంచ్‌ని సందర్శించారు. బ్రాంచ్ మేనేజర్ డిఎస్‌వి.సూర్యనారాయణ, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిబ్బంది బొకేలతో, పూలమాలతో,శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాహూ బ్రాంచ్ పరిధిలో ఉన్న ప్రాస్పెక్టివ్ ఎండిఆర్‌టి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. రాబోయే కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పాలసీదారులకు విస్తతమైన సేవలు అందిస్తామన్నారు. అన్ని టార్గెట్స్ పూర్తి చేసుకుని డివిజన్‌లో నెంబర్ వన్ స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ సెక్రటరీ నాగారపు నాగరాజు, ట్రెజరర్ వెంకన్న దొర మాట్లాడుతూ ఏజెంట్లు పరంగా ఎటువంటి లోటు పాట్లు రాకుండా చూడాలని, బ్రాంచ్ అన్ని టార్గెట్స్ పూర్తి చేసి డివిజన్లోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు జయరావు,ఎం సూరిబాబు,పి శ్రీనివాసరావు,సాయి శ్రీనివాస్ పడమటి నాగేశ్వరరావు, కరిబండి నాగేశ్వరరావు,కరిబండి విష్ణుమూర్తి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న మేనేజర్,సిబ్బంది